సకల సద్గుణంబులు చక్కగా లేకున్న
వారు గురులు కారు వాస్తవముగ
సద్గుంణంబులు, సద్బుద్ధి, సత్యనిరతి
భక్తి, క్రమశిక్ష, కర్తవ్యపానమును
నేర్పునదె విద్య విద్యార్థి నేర్వవలయు.

ప్రేమస్వరూపులైన అధ్యాపకులారా! విద్యార్థులారా!

విశాలమైనట్టి ఈ ప్రపంచమందు అనంతమైన కాలము ప్రచండ మారుతమువలె అతి వేగముగా కదలిపోవుచున్నది. మానవుడు తన కర్తవ్యాన్ని గుర్తించుకొనక పూర్వమే కాయమును విసర్జించుచున్నాడు. కాయము ఏ నిముత్తమై ఏర్పడినటువంటిదని ప్రతి వ్యక్తీకూడను గుర్తించుట అవసరం. 'పరోపకారర్థ మిదం శరీరం', కర్మాచరణ నిమిత్తమై మనకు ఈ కాయము ఏర్పడుచున్నది. కర్మ ఏనిమిత్తమై ఏర్పడచున్నదనగా కాలము పవిత్రముగావించే నిమిత్తమై ఏర్పడుచున్నది. మన ప్రతి కర్మకూడను దివ్యమైన మార్గమునందు ప్రవేశపెట్టుటకు ప్రయత్నించాలి. ప్రతి కర్మకూడను ఆధ్యాత్మికంగానే మనము ఊహిస్తూ రావాలి. work will be transformed into worship.

కనుకనే, కాయము, కాలము, కర్మము ఈ మూడింటియొక్క సత్యాన్ని మొట్టమొదట అధ్యాపకులు గుర్తించాలి. కర్మాచరణ కోసం కాయము, కాలమును పవిత్రముచేసే నిమిత్తమై కర్మ అనే రెండు అంశములను మనము నిరంతరమూ హృదయమునందు ఉంచుకోవాలి. మానవుని ఉత్తమ స్థితికి గొనిపోవుది లేక అధమ స్థితికి గొనిపోవునది మానవునియొక్క కర్మమే. కర్మ ఒక అద్దము వంటిది. మన ముందు పెట్టిన అద్ధము, మనయొక్క అందచందములను ఏరీతిగా నిరూపిస్తున్నదో అదేవిధముగా మానవుడు చేయు ప్రతి కర్మయందు కూడను మంచి, చెడ్డ అనే ప్రతిబింబాలను మనకు అందిస్తూ ఉంటున్నాది.

కొంతమంది పని ప్రారంభించుటకు పూర్వము పరమ శాంతముగా కనిపిస్తారు. పనిలో ప్రవేశించగనే విసుగు, కోపము ప్రదర్శిస్తుంటారు. మరికొంతమంది పని ప్రారంభించక పూర్వము కొన్నివిధములైన అలజడులతో నిండి ఉంటారు. పనిలో తాము ప్రవేశంచగనే ప్రశాంతముగా కర్మలు ఆచరిస్తూ పవిత్రమైన భావములచే దానిని అనుభవిస్తుంటారు. కనుక, పనులయందే మానవునియొక్క పవిత్రతగాని, అపవిత్రతగాని మనకు ప్రత్యక్షమగుచున్నది. కనుకనే, భగవద్గీతయందు, 'కర్మణ్యేవాధికారస్య మాఫలేషు కదాచన'. మనము చేయు ప్రతి కర్మయందు భవిష్యత్తుకు సంబంధించిన గుణములు మనకు నిరూపిస్తూ ఉంటాయి.

మొట్టమొదట మనము నిష్కామకర్మలో ప్రవేశించుట చాలా కష్టము. దుష్కర్మలనుండి సత్కర్మలలో ప్రవేశించి, సత్కర్మనుంచి నిష్కామకర్మలో చేరటం సరియైన మార్గము. కర్మ ఒక ధర్మామీటరు వంటిది. మానవునియొక్క ఉష్ణము ఎంతవరకు ఉన్నదీ ధర్మామీటరు ఏవిధముగా చెప్పగలుగుతున్నాదో అదేవిధముగనే మానవుడు చేయు కర్మకూడను, తనలో ఉన్నటువంటి తాపత్రయములు ఎంతవరకు చల్లారినవి, ఎంతవరకు అభివృద్ధి అయినవి, ఎంతవరకు నిలచినవి అనేది నిరూపిస్తుంటాయి. కనుక, మానవుడు సాత్వికగుణమునందున్నాడా, లేక రాజసికమందున్నాడా అనేది మనం ఆచరించే కర్మలే నిరూపిస్తున్నాయి. మానవుడు కర్మప్రవీణుడైనప్పుడు, కర్మలో ప్రవేశించినప్పుడు, కర్మశూరుడైనప్పుడే మన మావత్వంయొక్క దివ్యత్వాన్ని నిరూపించుటకు వీలవుతుంది. మానవుడు పవిత్రమైన కర్మల ద్వారా తన దివ్యత్వాన్ని దర్శించుకోవాలని కోరే, అభిలషించే మానవునకు మొట్టమొదట ఒకవిధమైన గుణము అవసరము. ఆ గుణమే శీలము. ఇది చెడుప్రవర్తనలను ఏమాత్రం సహించదు. అంతియేకాదు, కర్మశీలత్వాన్ని అభివృద్ధిపరచుకుంటూ దివ్యభావాలతో తాను పోషిస్తూవస్తుంది. అంతియేకాక సాంఘిక జీవితమునకు సర్వోత్తమమైన స్థానాన్నికూడను అందిస్తుంది శీలము. ఇంతేకాక అన్నమునకై జీవించుటకు యిష్టపడక ఆశయానికై జీవిస్తుంది. ఈవిధమైన శీలము లేనటువంటి జీవితము కేవలము చీకటి మందిరముగా ఉంటూ, త్రాడు తెగిన గాలిపటంలా ఉంటుంది జీవితం. చెల్లని రూపాయి వలె చలామణి కానిది శీలము లేని జీవితం'

ఇట్టి పవిత్రమైన శీలము ఈనాటి విద్యార్థులలో కొంతవరకు సన్నగిల్లిపోవటం చేతనే విద్యాసంస్థలు నిజంగా విప్లవానకి గురి అగుచున్నాయి. ఇంతేకాక కేవలం విద్యావంతులమని విఱ్ఱవీగుతున్నారేగాని వివేకశూన్యులుగా చలామణి అగుచున్నారు. ఈనాడు విద్యయందు కేవలము గ్రంథపరిచయము మాత్రమే మనము అనుభవిస్తున్నాము. కాని, ఆచరణయందు, ప్రవర్తనయందు మనము అతి దూరముగా ఉంటున్నాము. శీలమును మనము అభివృద్ధిగావించే నిమిత్తమై సత్యసాయి బాలవికాస్, సత్యసాయి విద్యావిహార్, సత్యసాయి ఉన్నత పాఠశాల, సత్యసాయి జూనియర్ కాలేజి, సత్యసాయి డిగ్రీ కాలేజి పేర్లతో మనము అభివృద్ధిగావించుకుంటూ ప్రారంభము చేస్తున్నాము.

మనము the end of education is character అని అంటున్నాముగాని character అంటే ఏమిటో మనము తెలుసుకోటానికి

ప్రయత్నించటం లేదు. కేవలము సత్కర్మలు ఆచరించినంత మాత్రమున, భజనలు చేసినంత మాత్రమున, సత్సంగములో ప్రవేశించినంత మాత్రమున ఇవి గుణములయొక్క సహజములు కానేరవు. ఇది character కి సంబంధించినది కాదు. దుర్భావములు హృదయంలో చేరకుండా చూచుకోవటం ఉత్తమమైన character. వాటిని క్రియాచారణలో దింపకుండా పోవటమే ఒకవిధమైన character . మనము ఏదో ఒక పర్యాయము తప్పుచేసినంత మాత్రమున తప్పుకానేరదు. చేసిన తప్పునే పదేపదే చేయటమే పెద్ద తప్పు. కనుక, మనం తెలిసో, తెలియకో పూర్వము మనము దుర్భావములను, దుర్గుణములను కొంతవరకు విజృంభింప చేసుకోవటం మానవుని అసహజంగా ఉంటుంది. కాని, ఇది తప్పు అని తెలుసుకొన్న తరువాత వాటిని తిరిగి ఆచరణయందు పెట్టటానికి ఏమాత్రమూ మనము మనస్కరించకూడదు.

ఈనాడు మనం బాలవికాస్‌నందు ఈవిధమైన పవిత్రమైన గుణములను అభివృద్ధిపరచే మార్గాన్ని చేపట్టాలి. అయితే పిల్లలకు బోధించటానికి మనము ప్రయత్నము చేయక పూర్వము ఈ character ను మనం సజీవితంలో ప్రదర్శించాలి. మనము అట్టి character నే నిత్యజీవితమునందు అనుభవించకుండా కేవలము పిల్లలకు మాత్రమే బోధించటానికి ప్రయత్నముచేస్తే ఇది ఏమాత్రము మన ఆశయాన్ని పూర్తిగావించలేదు. ఆచరించి పిల్లలకు అందించటానికి సంసిద్ధముగా ఉండాలి అధ్యాపకులు. ఏ తప్పును చేస్తే పిల్లలను దండిస్తూ ఇది సరియైనది కాదని వారిని మందలిస్తూ ఉంటున్నామో అలాంటి తప్పు మనం చేయకుండా చూచూకోవాలి. ఈవిధమైన ఆదర్శవంతమైన నడవడికను పిల్లలకు అందించటములోనే భవిష్యత్తుయొక్క క్షేమము ఆధారపడి ఉంటున్నాది.

ఈ ప్రపంచములో అన్నింటికంటే విలువైనది ఏమిటని ప్రశ్నిస్తే కొంతమంది వెండి అనో, కొంతమంది బంగారమనో, కొంతమంది వజ్రాలనో అనవచ్చు. కాని వెండి, బంగారు, వజ్రాలు కావు విలువైనటువంటివి. మానవుడే విలువైనవాడు. మనకు అగోచరమై, అప్రతిష్టంగా ఉన్న భూమియందు బంగారును త్రవ్వి తెచ్చి దానిని పరిశుద్ధముచేసి విలువగా మార్చేటువంటివాడు మానవుడే. మొద్దుగా పడినటువంటి రాయిని తీసుకొని దానిని కట్టింగ్స్ చేసి డైమెండ్‌గా మార్చి విలువను అందించేవాడు ఎవడు? మానవుడు. కనుకనే, అన్నింటికంటే విలువైనవాడు మానవుడు. ఇటువంటి విలువైన మానవజాతిని మనం నిల్పుకొని దానిని కాపాడేటువంటి ప్రయత్నము మానవునియందు మాత్రమే ఉన్నది.

ప్రభుత్వము ప్రజలయొక్క క్షేమాన్ని కోరి అనేక శాసనములను నియమించును. మానవుని నిత్యజీవితమునకు సంబంధించిన సదుపాయములు అనేకము ప్రభుత్వము ఏర్పాటుచేయవచ్చును. పల్లెల జీవితంలో అనేక ఇక్కట్లు పడుచున్న వారికి చక్కని సదుపాయములు కూడను చేకూర్చవచ్చును. అయితే, శాసనములు ఎంత ఉత్తమమైనటువంటివి అయినప్పటికీ వాటిని ఆచరించే ప్రజలయందు ఉత్తమ భావాలు లేకున్న నిరుపయోగములు. కనుక, సద్వినియోగపరిచే ప్రజలు ఈనాడు ఎంతైనా అవసరము. మానవునకు కావలసిన సదుపాయములు విరివిగా దొరుకుచున్నవి. నిత్యజీవితమునకు సంబంధించిన సదుపాయములు అనుకూలంగా అనేకం ఉన్నవి. చదువుసంధ్యలయందా, కావలసినన్ని సంస్థలు ఏర్పడ్డాయి. ధనార్జన మార్గములా, లెక్కలేనన్ని. కాని, మనలో ఏమాత్రమూ తృప్తి, శాంతి కలగటం లేదు. కారణమేమిటి? తనలోనున్న పవిత్రమైన గుణములు తాను అభివృద్ధిపరచుకోలేక పోవటంచేతనే సంతోషాన్ని అనుభవించలేకపోతున్నాడు. ఈనాడు మానవుని మానవత్వాన్ని అభివృద్ధి పరచుకొనేది అవసరం.

పాశ్చాత్యదేశాలలో అనేకవిధాలుగా సాంకేతిక విజ్ఞానశాస్త్రము పెరిగిపోవుచున్నది. చేపలవలె జలమునందు సంచరించటము సులభంగా అభ్యసిస్తున్నారు. పక్షులవలె ఆకాశంలో సులభంగా ప్రయాణం చేయటంకూడా అభ్యసిస్తున్నారు. కాని, మానవునివలె భూమిపై జీవించటానికి వారు ఏమాత్రమూ ప్రయత్నించుట లేదు. మనము భూమిపై జీవించటానికి తగినటువంటి ప్రయత్నము చేయాలిగాని, ఆకాశంలో సంచరించిన మనయొక్క జీవితము సరియైనదని అనిపించుకోదు. ముఖ్యంగా మానవత్వమంటే ఏమిటో మనం గుర్తించుకోవాలి. అప్పుడే బాలవికాస్ విద్యార్థులకు బోధించటానికి ఒకవిధమైన ధైర్యము ఏర్పడుతుంది. మానవత్వమంటే కేవలము తిండి, నిద్రలతో జీవిస్తూ, ఇంకా కొన్నికొన్ని ఇంద్రియ భోగములను అనుభవిస్తూ కాలం వ్యర్థంగావించుకోటం కాదు.

చాలామంది బైబిల్‌లో చదివి ఉంటారు. ఒకానొక సమయమందు జీసస్ బజారులో నడచుకుంటూ వెడుతున్నాడు. ఒక మూల ఒక వ్యక్తి త్రాగి, తాను మైమరచి పడిపోయాడు. అతని దగ్గరకు జీసస్ వెళ్ళి, 'నాయనా! ఏమిటి నీవు ఈ పరిస్థితిలో ఉంటున్నావు? త్రాగినా, ఇంత మైమరచి త్రాగటమనేటువంటిది ప్రమాదకరము. మంచిదికాద'ని బోధించాడు. అప్పుడు ఆ వ్యక్తి, 'ప్రభూ! నాకు పూర్వం కన్నులు లేవు. అప్పుడు జీవితమంటే ఏమిటో అర్థం లేకుండా ఉండేది. అలాంటి పరిస్థితిలో మీరే నాకు ఈ కన్నులు ప్రసాదించారు. ఈ కన్నులు రావటంచేత ప్రపంచములో ఉన్నటువంటి ఈ భోగములంతా అనుభవించాలనే ఉద్దేశ్యంతో త్రాగి తందనాలాడుతూ నా జీవితాన్ని ఈవిధంగా గడుపుతున్నాను'. అప్పుడు జీసస్, ' ఛీ! ఛీ! మానవాతీతమైన శక్తితో ఈవిధంగా చేశాను' అని తనలోతాని చాలా బాధపడ్డాడు. మరికొంత దూరము వెళ్ళిన తరువాత మరొక వ్యక్తి కామాంధుడై బజారునందు స్వేచ్ఛావిహారము సలుపుతున్నాడు. చూచాడు జీసస్, ' నాయనా! ఏమిటి మానవత్వమంటే? బజారు కుక్కలవలె జీవించటమా మానవత్వమంటే? ఏమిటి ఈ వికారము' అని అడిగాడు. అప్పుడు ఆ వ్యక్తి చెప్పాడు, ' ప్రభూ! నాకు పూర్వం కుష్ఠురోగము ఉండేది.

అది తమయొక్క మానవాతీతమైన శక్తి ద్వారా నివారణగావించారు. నాకు కుష్ఠురోగము ఉన్నంతవరకు నా దగ్గరకు ఎవ్వరూ వచ్చేవారు కాదు. అప్పుడు ఈ ఇంద్రియములయొక్క తత్వాన్ని అనుభవించటానికి వీలుకాకుండా పోయింది. ఇప్పుడు చక్కని ఆరోగ్యాన్ని అందించటము వలన ఈ మార్గములో నేను జీవిస్తున్నాను'. జీసస్ అంటున్నాడు, ' ఛీ! ఛీ! వీని రోగనివారణ చేయటము ఈవిధమైన దుర్మార్గమును అనుభవించుటకా! నా చేతుల ద్వారానే ఇతని జీవితాన్ని పాడుచేస్తున్నాను'. అనగా జీవితమంటే కేవలం ఇంద్రియ సుఖములు అనుభవించటముగాని, తప్పత్రాగి ఈ ఆహారవిహారాదులతో జీవితం అంతంగావించటం కాదు.

ఆకలిదప్పులు, ఇంద్రియములు ఆనందము పశుపక్షిమృగాదులు సైతము అనుభవిస్తున్నాయి. దీనికి మానవుడుగా ఎందుకు పుట్టాలి? మానవుడుగా పుట్టి, అనేక విద్యలు నేర్చి, యూనివర్సిటీలకు పోయి ఉన్నతసత్యములందుకొని ఇంత విద్యావంతుడని పేరుపొందిన మానవుడు కూడను పశువులవలె జీవిస్తే ఇంక మానవత్వం ఏమిటి? పశువులు, పక్షులు, మృగములు ఏ హైస్కూలుకు పోతున్నాయి, ఏ కళాశాలలో చదువుతున్నాయి! మనకంటే పశుపక్షిమృగాదులు చాలా చక్కగా కనిపిస్తున్నాయి. వాటికి ఒక సీజన్, రీజన్. కాని మానవునకు no reason, no season. ఇలాంటి సమయంలో మానవుడుగా పుట్టి మనం చేసేటుంటి పని ఏమి? ఈనాడు మానవజాతిలో మూడురకములైన భావములు కలిగినవారు కలరు. ఒక తరగతివారు భక్తిరసభావమును పూని ఉంటారు. రెండవ తరగతివారు క్రియాశీలురై ఉంటారు. మూడవ తరగతివారు నిరంతరము విచారణత్వంలో మునిగి ఉంటారు. మొట్టమొదటి తరగతివారు ఏదో ధ్యానం, భగవచ్చింతన, భజన, స్మరణ ఇత్యాది కార్యములందు తాము ఆనందాన్ని అనుభవిస్తుంటారు. ఇక, రెండవ తరగతివారు సేవాకార్యాములలో కర్మాచరణమందే నిమగ్నులై ఉంటారు. మూడవ తరగతివారు తమయొక్క ధీశక్తిచేత తత్త్వవిచారణయందే మునిగి ఉంటారు. ఈ మూడే భక్తి, కర్మ, జ్ఞాన మార్గములు. అయితే ఈనాడు ఈ పదములకు, ఈ కర్తవ్యములకు విపరీతమైన అర్థములు మనము కల్పించి, విపరీతమైన వికార మార్గములు అనుసరిస్తూ వస్తున్నాము. నిత్యానిత్య పరిశీలనయందు మాత్రమే విచారణాశక్తిని ప్రవేశపెట్టాలి. సత్యసంకల్పముచేత విచారణశక్తిని ప్రవేశపెట్టాలి. అయితే, ఈనాడు సంక్షిప్తమైన దృష్టితో మన ప్రజ్ఞాశక్తిని ప్రారంభిస్తున్నారు.

ఈనాడు మనం భక్తిని స్వార్థమైన మార్గమునందు ప్రవేశపెడుతున్నాము. భక్తి, జ్ఞాన, కర్మ మార్గములు మూడూ భిన్నమైనటువంటివి కావు. ఈ మూడు అవినాభావసంబంధమైనటువంటివే. ఒకదానిని వదలి మరొటి ఉండుటకు వీలుకాదు. భక్తిమార్గమునందు కర్మ, జ్ఞాన మార్గములు యిమిడి ఉంటున్నాయి. కర్మయందు భక్తి, జ్ఞానములు రెండునూ అంతర్భూతమై ఉంటున్నాయి. భక్తియందు కర్మ, జ్ఞానములు రెండూ అంతర్భూతమై ఉంటున్నాయి. చిన్న ఉదాహరణ. మన ముందు ఒక చిన్న స్టూలు ఉంటున్నాది. దానికి మూడు కాళ్ళు ఉంటున్నాయి. ఈ మూడు కాళ్లలో ఏ కాలు లేకపోయినా అది నిలువదు. ఇందులో మూడు కాళ్ళు ఏమంటే భక్తి, జ్ఞాన, కర్మలు. భక్తి, జ్ఞాన, కర్మలు మూడు పాదములు. దీనిపైన చక్కని నునుపైన పలకను వేస్తారు. ఆ పీఠమే లేక మనము కూర్చోటానికి వీలుకాదు. కనుక, భక్తి, జ్ఞాన, కర్మ అనే మూడు పాదములపైన సర్వజన సమానప్రేమ అనే పలకను వేసినప్పుడే మనం సరిగా దానికి స్థానం యిచ్చినవారమౌతాము. ఈవిధమైన ఆధారము కాళ్ళుగా చూచుకొని, ఆధేయము పలకగా చూచుకొన్నప్పుడు మనయొక్క జీవితమనేటువంటిది దానిపైన విశ్రాంతి పొందటానికి వీలవుతుంది. ఈ మూడింటియందు ప్రేమ అవసరము. ఈ మూడింటిపైన ప్రేమ అనే ప్లేటును స్క్రూ వేసి బిగించారు. ఈ స్క్రూ విశ్వాసము. ఈ విశ్వాసమే లేకపోతే మూడు కాళ్ళుండినా, పలక ఉండినా భద్రము లేదు.

ప్రేమను మనం లౌకిక దృష్టితో అనుభవిస్తున్నాము. ముఖ్యముగా సాయి సంస్థలవారు చక్కగా గుర్తించవలసిన విషయాలలో ఇది చాలా ప్రధానం. సత్యసాయి సంస్థలలో సత్య, ధర్మ, శాంతి, ప్రేమలు చాలా ప్రధానమైనవి. అయితే ఈ నాలుగూ గుణములకు సంబంధించినవా లేక గుణాత్మకమైనట్టివా అని విచారించాలి. సత్యం అంటే ఏమిటి? ఈ సత్యము దేనికి సంబంధించినది? చూచినది చూచినట్లుగా, విన్నది విన్నట్లుగా, చెప్పింది చెప్పినట్లుగా, అనుభవించినది అనుభవించినట్లుగా చెప్పటము సత్యము కాదు. కారణమేమనగా చూచిన కన్నులు కేవలము గోళముల వంటివి. కన్నులు చక్కని ఆరోగ్యంగా ఉంటున్నప్పుడు తెలుపు తెలపుగాను, నలుపు నలుపుగాను, పసుపు పసుపుగాను, ఎరుపు ఎరుపుగాను కనిపిస్తుంది. కాని, పచ్చకామిర్లు వస్తే అదే కంటికి అన్నీ పచ్చగానే కనిపిస్తాయి. కన్నులు చూచిన దానిని చూచినట్లు చెబుతుందిగాని యదార్థమును చెప్పటం లేదు. కనుక, కన్నులు చూచి చెప్పినటువంటిది సత్యము కాదు. సత్యమునకు, నాలుకకు అవినాభావ సంబంధము. అందువలననే సత్యం వద, సత్యము చెప్పుము. చెప్పటము నాలుకకు మాత్రమే సంబంధము. కన్నులకు సంబంధము లేదు. ఇంక ధర్మము. ధర్మము దేహానికి సంబంధినది. క్రియాచరణలో దానిని నిరూపించవలసినటువంటిది. ధర్మము, ధర్మమని ధర్మము చెబుతే ప్రయోజనము లేదు. ధర్మం చర- చేసి చూపించమన్నాయి. ఇక శాంతి. శాంతి మనస్సుకు సంబంధించినది. ఇక్కడ వాక్కు, కాయము, మనస్సు - మనోవాక్కాయములు ఈ మూడింటికి సంబంధించినటువంటివి. సత్యము సాత్విక గుణము. ధర్మము ఆచరించే దేహమునకు రాజసికగుణము. మనస్సు తామసికము. అయితే ప్రేమ ఏమిటి? ఈ మూడు గుణములకు అతీతమైనది ప్రేమ. కనుకనే, love is God. అన్నారు. ఈ ప్రేమను గుణముల దగ్గరకి, ఈ ప్రేమను దేహము దగ్గరికి, ఈ ప్రేమను మనస్సు దగ్గరికి లాక్కోటముచేతనే ఈ ప్రేమ మాలిన్యమైపోతున్నాది.

మనోవాక్కాయములు ఈ ప్రేమను ఆ స్థాయికి దిగజార్చుటచేతనే మనము కొన్నివిధములైన అశాంతికి గురైపోతున్నాము. ప్రేమ ఎప్పుడూ సాక్షీభూతమై ఉంటున్నాది. నీ వాక్కును, నీ దేహమును, నీ మనస్సును ప్రేమ దగ్గరకు తీసుకొని పోవచ్చును కాని, ప్రేమను నీ దేహము దగ్గరకు తీసుకురాకూడదు. అదేవిధముగా ఈ స్పీకరు ఒక దైవమే. దానిని దైవము దగ్గరకు తీసుకువెళ్ళు. అంతేగాని దైవమే ఛైర్, దైవమే బట్ట, దైవమే స్పీకర్ అని దైవాన్ని ఈ క్రింది స్థాయికి తీసుకురాకూడదు. కనుక, మనము చిన్నదానినికూడను ఉన్నత స్థాయికి తీసుకుపోవాలిగాని దాన్ని క్రిందిస్థాయికి తీసుకురాకూడదు. కనుక, సత్యసాయియొక్క ఈ సత్య, ధర్మ, శాంతి, ప్రేమ ఈ నాలుగు పదములు నాలుగు వేదములయొక్క మహావాక్యములే.

ఈ సత్య, ధర్మ, శాంతి మూడూ కూడను మనోవాక్కాయములకు సంబంధించినవే. ప్రేమ మాత్రము ఈ మూడింటికీ అతీతమైనది. ఈ సత్య, ధర్మ, శాంతిలు మనం పోల్చుకున్నప్పుడు భక్తి, కర్మ, జ్ఞానములు. ఇవి కేవలం మూడు కాళ్ళ వంటివి. దీనిపైన ఉండినటువంటి ప్లేటే ఈ ప్రేమ. ఈవిధంగా మనము ఆధ్యాత్మికభావాన్ని, నైతికగౌరవాన్ని, ప్రాపంచికముయొక్క తత్త్వాన్ని సమ్మిళితముగావించి తద్వారా మనం ప్రబోధ చేయటానికి ప్రయత్నించాలి. ముఖ్యంగా ఆధ్యాపకులు తక్కువ స్థాయిలోని వారుగా మనం భావిస్తున్నాము. కాని, అది చాలా పొరపాటు. లోకములోని అన్ని ఉద్యోగములకంటే అధ్యాపక వృత్తి చాలా ఉత్తమమైనది. చాలా బాధ్యతకలిగినటువంటిది. కారణమేమనగా భావిభారతోద్ధారకులుగా తయారుచేయువారు ఈ అధ్యాపకులే. భావిపౌరులుగా తయారుచేసేవారు ఈ అధ్యాపకులే. ప్రపంచమును పరిపాలించే వీరులుగా తయారుచేసేవారు ఈ అధ్యాపకులే. ఈనాడు మనం లేతహృదయులైన బాలబాలికలకు అధ్యాపకులు పవిత్రమైన భావములు వారికి బోధించటముచేత వారు భవిష్యత్తులో మంచి పరిపాలకులుగా కాబోతుంటారు.

ఇండియాలో మీరు విని ఉంటారు బాలగంగాధర్ తిలక్ అనే పేరు. ఆయన స్వరాజ్య పోరాటములో ముందంజవేస్తూ వెళ్ళాడు. 'తిలక్! మనకు స్వాతంత్ర్యము వచ్చిన తరువాత ప్రధానమంత్రి పదవిని తీసుకుంటావా?' అని కొంతమంది మిత్రులు అడిగారు. అప్పుడు ఆయన చెప్పారు, 'నేను ఏవిధమైన పరిపాలనా అధికారిని కాను. కారణమేమనగా నేను పరిపాలకులను తయారుచేసేవాడుగా ఉంటాను. పూనాలో నేను స్థాపించిన హైస్కూలులో టీచరుగా ఉంటాను. కారణమేమనగా లేతహృదయులైన ఈ బాలబాలికలకు చక్కని తర్ఫీదు యిచ్చినప్పుడు, పరిపాలనాదక్షత వారియందు ప్రవేశింపజేసినప్పుడే భవిష్యత్తులో మన భారతదేశము చక్కని ఆనందాన్ని అనుభవిస్తుంది' అన్నాడు. అదేవిధముగా కృష్ణునియొక్క చరిత్రయందుకూడా. కృష్ణుడు మహావీరుడైనప్పటికీ, సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు, సర్వశక్తిమయుడు అయినప్పటికినీ, అన్ని రాజ్యములు జయించి ఇతరులుకు పట్టము కట్టుకుంటూ పోయాడుగాని తాను ఒక్క రాజ్యానికికూడా అధికారి కాలేదు. అనగా తాను కింగ్‌ని తయారుచేసే కింగ్‌మేకర్, కింగ్ గొప్పవాడా? కింగ్ మేకర్ గొప్పవాడా? అదేవిధముగా ఈనాడు అధ్యాపకులందరూకూడా పరిపాలకులుగా తయారుచేసేటటువంటివారు కనుక పరిపాలకులకంటే అధ్యాపకులే గొప్పవారు. కనుక, మీ ప్రయత్నము మీద ఆధారపడి ఉంటున్నాది దేశముయొక్క భవిష్యత్తు, ఉన్నతి. దేశముయొక్క సౌభాగ్యము ఉన్నతమైనదిగా ఉండాలని మీరు భావించేటువంటిదే తథ్యమైతే మీరు ఈ కార్యమునందు దీక్షను వహించి సరియైనటువంటి పరిపాలకులుగా బిడ్డలను మీరు తయారుచేయాలి.

ఇక్కడ చేరినటువంటివారిలో ఎంతమంది నిజమైనటువంటి అధ్యాపకులుగా వుంటారు. అధ్యాపకులమని పేరుపెట్టుకుంటామేగాని అద్యాపకునికి తగిన ప్రయత్నములో, పనిలో మనం పూర్తి నిమగ్నం కావటంలేదు. మీరు హృదయపూర్వకముగా మీ కర్తవ్యాన్ని నిర్వర్తించినప్పుడు హృదయపూర్వకమైన ఫలితముకూడా మీకు లభిస్తుంది. చిన్న ఉదాహరణ. ఒక కాలేజీలో ఫుల్‌టైమ్ అప్పాయింట్ చేస్తారు ఒక లెక్చరర్‌ని. అతనికి ఫుల్ సేలరీ ఇస్తారు. కాని, పార్ట్ టైమ్ లెక్చరర్‌కి ఫుల్ సేలరీ ఇవ్వరు. అదేవిధముగా మనం ఫుల్ హార్ట్‌తో చేసినప్పుడు ఫుల్‌గ్రేస్ అనే సేలరీ మనకు వస్తుంది. అయితే పార్ట్‌టైమ్ డివోషన్‌గా చేస్తే పార్ట్‌టైమ్ సేలరీయే వస్తుంది. మనం దానికి తగిన శ్రద్ధాభక్తిని అభివృద్ధి పరచి మనయొక్క కర్తవ్యాన్ని పూర్తిగా నిర్వర్తించాలి. ఇది నాకోసము, మీకోసము కాదు, ప్రపంచముకోసం, దేశముయొక్క సౌభాగ్యముకోసం, దేశముయొక్క కల్యాణముకోసం. కనుక, సర్వ లోకములు, సర్వులూకూడ క్షేమంగా ఉండాలనే విశాలమైన భావాన్ని అధ్యాపకులు అభివృద్ధిపరచుకోవాలి. ఎందుకనగా అధ్యాపకులు శ్రమపడితే దేశం ఎంతైనా బాగుపడుతుంది. అంతేకాక మరొక విషయం చెబుతున్నాను. అనేకమంది ఏ పనీలేకుండా టైమును వృధాపరచటమే వారికొక పనిగా పెట్టుకుంటారు. ఈనాడు మానవునికి కొన్నికొన్ని దుర్భావములు, అనవసరమైన భావములు రావటానికి కారణమేమిటి? వచ్చేటువంటి నూరుమంది భక్తులలో తొంభైమంది అశాంతిగానే ఉంటున్నారు. ఎవరిని అడిగినాగాని దేహరీతిగానో, మనోరీతిగానో, ఆత్మరీతిగానో అశాంతి, అశాంతి. ఈ అశాంతికి మూలకారణము మొట్టమొదట మనం కనిపెట్టాలి. ఈ అశాంతికి మూలకారణము మనం పెంచుకుంటున్న అనవసరమైన భావములే. ఈ అనవసరమైన భావాలు చేరటానికి కారణమేమిటి? పనిలేకుండా పోవటం.

ఏవిధంగా అంటే దానికి చిన్న ఉదాహరణ. 1914 సంవత్సరంలో ప్రపంచయుద్ధం వచ్చింది. అపుడు ఒక యువకుడు దేశాభిమానంచేత ఆవేదన అతనిలో పెరిగిపోయింది. నా దేశంపైన పరరాజులంతా వచ్చి దండెత్తిరావటంచేత నా దేశాన్ని

కాపాడుకోటం నా ప్రథమ కర్తవ్యమని తీవ్రవైరాగ్యంచేత తల్లిదండ్రులకు చెప్పకుండానే ఆ యుద్ధంలో ప్రవేశించాడు. చేరిన తక్షణమే ఉదయమునుండి సాయంత్రము వరకు దండిగా పని చెప్పారు. ఈ ఫుల్ వర్క్ పెట్టటంచేత పని, పని, పని అంటూ పనితో తాను జీవించాడు. కాని, రెండు నెలలు గడిచిందోలేదో యుద్ధం ఆగిపోయింది. యుద్ధం నిలచిపోవటంచేత వీళ్ళకంతా విశ్రాంతి చిక్కింది. విశ్రాంతి చేక్కేటప్పటికి ఈ పిల్లవాడు ఒకచోట పోయి కూర్చున్నాడు. మా తల్లిదండ్రులు ఏమిచేస్తున్నారో ఏమిటో, నేను వచ్చిన తరువాత నా తల్లిదండ్రులు ఎంత బాధపడుతున్నారో ఏమిటో, నా సిస్టరు, బ్రదరు ఎంత కష్టపడుతున్నారో ఏమిటో అని ఇంటిపై మనసు పోయింది. ఈవిధంగా తల్లదండ్రులను, అన్నదమ్ములను, బంధుమిత్రులను తలచుకొనుచూ ఏడుస్తూ కూర్చున్నాడు. చూచాడు వాళ్ళ ఆఫీసరు. తక్షణమే ఆ అబ్బాయిని పిలిచాడు, 'బాయ్! నీవు అక్కడికి వెళ్ళి నాలుగడుల పొడవు, నాలుగడుగుల వెడల్పు, నాలుగడుగుల లోతు గుంట త్రవ్వు' అన్నాడు. వాడు పార తీసుకున్నాడు, త్రవ్వినాడు. సాయంకాలం ఐదు గంటలైంది. తక్షణమే వచ్చేశాడు. 'సార్! పని పూర్తయింది' అన్నాడు. 'అయితే ఆ మట్టినంతా తీసి గోతిలో వేయి' అన్నాడు ఆఫీసరు. ఆరుగంటలైంది. ఆ అబ్బాయిని పిలిచాడు, రెండు బిస్కట్లు ఇచ్చి పొమ్మన్నాడు. బాగా అలసిపోవటం వలన పోయినాడు పండుకొని నిద్రపోయినాడు. రెండవ దినము ఆ పిల్లవానిని చూచి, 'నిన్నటి దినము ఎన్ని పర్యాయములు ఇంటిని తలచుకున్నావు?' అడిగాడు ఆఫీసరు. 'టైమే లేకపోయింది, మనుష్యులను ఎక్కడ తలచుకుంటాను' అన్నాడు. కనుక, ఏ పని లేకపోవటంచేత ఈవిధమైన భ్రాంతులంతా మనం పెంచుకుంటున్నాము. ఫుల్ వర్క్ చేస్తే మిగతా ఆలోచనలకు చోటు వుండదు. కనుకనే, work is worship.

అధ్యాపకులనగా చాలా ఉన్నత స్థాయిలో ఉన్నటువంటివారు. ఈనాటి అధ్యాపకులు కేవలము జీవనోపాధి నిమిత్తమై ఈ వృత్తిని చేపట్టామని భావించటముచేతనే ఈనాడు విద్యకూడను, వివేకముకూడను దినదినానికి క్షీణించిపోతున్నాది. మీకందరికీ తెలిసిన విషయమే. ఈనాటి విద్యావిధానము ఎంత దుర్గతిగా ఉంటున్నాది! ఎక్కడ చూచినా ఎద్యుకేషన్ అంటున్నారేగానీ ఎద్యుకేషన్ కనిపించటం లేదు. ఎక్కడ చూచినా అల్లర్లు, ఎక్కడ చూచినా విప్లవాలే, ఎక్కడ చూచినా కలహాలే. తల్లిదండ్రులకు ఏమాత్రమూ తృప్తికరంగా లేదు. తనకు తానుకూడా తృప్తిగా లేదు. ఇంతేకాకుండా ఈనాటి పాశ్చాత్యులేగాక, భారతీయులుకూడా ఇమిటేషన్ పెంచుకుంటున్నారు. ఇమిటేషన్ చాలా హీనము. ఒకరిని చూచి ఒకరు మంచిని నేర్చుకోవటం లేదుగాని చెడ్డను నేర్చుకుంటున్నారు. కనుక, ఈనాడు మనము మంచిని నేర్చుకొని, మంచి దారిని అనుసరించి, మంచిని బోధించటానికి ప్రయత్నించాలి. ఇంతేకాకుండా మన అధ్యాపకులు మరొక విషయాన్ని కూడను గుర్తించాలి. మన దేశభాషలయందుకూడను పిల్లలకు ఆదర్శంగా నిరూపించాలి. మనము ఏ డ్రస్సు వేస్తామో, మనం ఏరీతిగా ఉంటామో ఆవిధంగా మనం పిల్లలకు బోధించాలి. అధ్యాపకులే అసభ్యమైన డ్రస్సులు వేస్తూ, అధ్యాపకులే అసహ్యమైన ప్రవర్తనతో ఉంటే పిల్లలను ఏరీతిగా సరిచేయగలము? ఈనాడు చాలామంది అధ్యాపకులు అసభ్యమైన డ్రస్సులు వేసుకొని బెగ్గర్ మాదిరిగా, వికార వేషాలతో తయారౌతుంటారు. ఇవన్నీ చూస్తే చాలా అసహ్యంగా ఉంటుంది. ఇదా మన మగతనముయొక్క లక్షణాలు. మనము క్రియారూపమున నిరూపించాలిగాని. ఈ వికారమైన వేషాలతో కాదు. మనము ఇతరులయొక్క బాధలను, ఇతరులయొక్క కష్టాలను నివారణచేసేదాంట్లో నిరూపించాలి. మన మానవత్వాన్ని నిరూపించాలి. మన సత్యసాయి సంస్థలలో అంతా యూనిఫారం డ్రస్సులో ఉండాలి. simple dress, high thinking. అంతేగాని అతను గడ్డం పెంచుకున్నాడు నేనూ పెంచుకోవాలని, అతను మీసాలు పెంచుకున్నాడు నేనూ పెంచుకోవాలి, అతను సైడ్‌బర్న్ పెంచుకున్నాడని నేనూ పెంచుకోవాలి ఈవిధంగాపోతే నీ లైఫ్ వేస్టు. మనకు ఒక హృదయముంది. ఇతరులను ఎందుకు అనుసరించాలి? ఇవి మానవునికి వికారమైన వేషాలు. కనుక, మానవత్వాన్ని మనం మంచి గుణములయందు నిరూపించాలి. ఈనాడు ప్రపంచములో పెద్దలను చూచి పిల్లలు అనుసరిస్తుంటారు. కనుక, పెద్దలు బాగా ఉంటే పిల్లలుకూడా మంచి మార్గాన్ని అనుసరిస్తారు. మీ అందరికీ తెలిసిన విషయమే. మేథమేటిక్స్ టీచరు వస్తాడు. బోర్డు మీద వ్రాస్తాడు. ఇంగ్లీషు టీచరు వస్తాడు. గ్రంథం పట్టుకొని చదివి చెబుతాడు. ఈవిదంగా ఒక్కొక్క టీచరు వచ్చి ఒక్కొక్క రీతిలో బోధిస్తూ వస్తుంటారు. కాని, డ్రిల్ టీచరు 1, 2, 3, 4 అని తాను చేసి పిల్లలకు చూపిస్తాడు. కనుక, బాలవికాస్ టీచర్సంతా డ్రిల్ టీచరు మాదిరి ఉండాలి, చేసి చూపించాలి. మనకు కొన్ని కొన్ని సబ్జక్టులలో తక్కువ మార్కులు వచ్చినా ఫర్వాలేదు. మన బాలవికాస్ పిల్లలలో క్రమశిక్షణ అనే సబ్జక్టులో చక్కని మార్కు రావాలి. మిగతా సబ్జక్సులో దండి మార్కులు వచ్చి డిసిప్లిన్‌లో రిమార్క్ వస్తే ప్రయోజనం లేదు.

కనుకనే డివోషన్, డ్యూటీ, డిసిప్లిన్ ఈ మూడూ మన సబ్జక్సుగా చూచుకోవాలి. ఈనాడు లోకమంతా ఇన్ని విధములైనటువంటి క్రూరత్వానికి లేక కఠినత్వానికి దిగజారిపోవటానికి కారణం ఏమంటే ఆధ్యాత్మిక వికాసం లేకపోవటం. ఈ నైతిక గౌరవాన్ని మనం కోల్పోతున్నామంటే ఈ ఆధ్యాత్మికం లేకపోవటంచేతనే. కనుక, ఈనాడు మనం నైతికంగా, ఆధ్యాత్మికంగా మన జీవితాన్ని రెండు రెక్కలవలె చూచుకోవాలి. ఇంతేకాదు రెండు చక్రాల రథంవలె ఈ రెండిటినీ మనం ఆధారంచేసుకోవాలి. నైతికం, ఆధ్యాత్మికం మన నేత్రాలుగా ఉండాలి. ఈ లౌకికము ఎంత కాలము, క్షణక్షణమూ మారుతుంది. ఇవన్నీ పాసింగ్ క్లౌడ్స్. మన దేహము వదలిన తర్వాత కూడను మన గౌరవము లోకంలో శాశ్వతంగా ఉంటుంది. మనము ఆశలకోసం జీవించకూడదు. ఆశయాలకోసం జీవించాలి. ఐడియల్ కోసం జీవించాలి. లేకపోతే నిరాశకు గురియైపోతాము. ఆశలు శాశ్వతము కాదు. మన

సిద్ధాంతాలు, మన ఆశయాలు మొట్టమొదట మనం దృష్టిలో పెట్టుకోవాలి.

పిల్లలకు ఏవిధంగా బోధించాలనేది మొట్టమొదట బాలవికాస్ గురువులు తెలుసుకోవాలి. కొంతమంది బాగా చదివే పిల్లలు పరీక్షలలో ఫేయిలైపోతున్నారు. ఏమీ చదవని పిల్లలు పరీక్షలలో ప్యాసౌతున్నారు. కొంతమంది ఆశక్తిలేకుండా చదువుతారు. చదివినదంతా మరచిపోతుంటారు. అయితే దీనికి కొన్నికొన్ని సోపానాలున్నాయి. ఈ సోపానాల్ని సక్రమంగా పిల్లలకు బోధించిన అది శాశ్వతంగా వారికి హృదయాలలో నిలచిపోతుంది. ఈవిధమైన పద్ధతులు గుర్తించి బోధించే అధ్యాపకులు కనిపించటం లేదు. ఏదో పుస్తకాలు చూచి చెబుతున్నారు, నోట్సు వ్రాసుకుంటున్నారు అయిపోతున్నాది. కాదు, కాదు. దీనికి కొన్ని రకములైన ప్రత్యేక మార్గాలున్నాయి. ఆ మార్గాల ద్వారా మన పిల్లలకు బోధిస్తే మన విద్యావిధానము ఒక ఆదర్శమైనదిగా మారుతుంది. ఈ పాశ్చాత్య దేశాలలో అత్యధికంగా ఈ పద్ధతులు మనం అవలంబించాలి. రేపు, మరునాడు కొన్ని విషయాలు చెప్పటానకి పూనుకుంటాను. దానిని మీరు సక్రమంగా హృదయానికి హత్తుకొనే రీతిగా మీరు దానిని భావించి దేహరీతిగా అందులో కొన్ని అనుమానలను, సందేహాలను వుంటే వాటిని తెలుసుకొని ఆ మార్గాన్ని అవలంబించాలని నేను ఆశిస్తున్నాను. ముఖ్యంగా నేను అధ్యాపకుడను అనే భావన తుడిచివేయాలి. నేను శాశ్వతమైన విద్యార్థిని అని గుర్తించాలి. ఈనాటి విద్యార్థులు కొన్ని దినములు మీ దగ్గర విద్యార్థులుగా ఉండవచ్చును. తరువాత వారు వెళ్ళిపోవచ్చును. మీరు అటుల కాదు. జీవితమంతా మీరు చదివి పిల్లలకు బోధించాలి. కనుక, ఇంటిలో కొంత శ్రద్ధగా చదవాలి. నీవు నిరంతరమూ చదువుతూనే ఉండాలి, ఆచరిస్తూనే ఉండాలి. ఈవిధమైన కొంత శ్రమకు గురికావటముచేతనే దేశానికి ఎంతైనా సేవచేసినవారమౌతాము. ఈనాడు అల్లకల్లోలంగా ఉండినటువంటి దేశాన్ని ప్రశాంతిదేశంగా చేయాలంటే ఈ బాధ్యత అధ్యాపకులపై ఉంటున్నాది. ఈనాటి బాలవికాస్ పిల్లలంతా ఇక ముమ్ముందు వచ్చేటప్పటికి దేశము ప్రశాంతమైన స్థితిని అందుకుంటుంది. కనుక, నిజమైన దేశసేవ ఏదంటే, అధ్యాపకులదే నిజమైన సేవ. ఇదే మహాభాగ్యమని మీరు భావించాలి. నా ఒక్కడిద్వారా పదిమంది మంచివారుంటే నాకంతే చాలు, దేశం బాగుపడుతుంది.

దేశము అనేటువంటిది పెద్ద యంత్రమువంటిది. దీనిలో ఒక్కొక్క వ్యక్తి ఒక బోల్టు, నట్టు, స్క్రూ, పిన్‌గా వుంటుంటారు. ఇంత పెద్ద ప్రపంచములో నేను ఒక్కడిని చేయకపోతే ఏమి నష్టమని మనం నిరాశకు గురికాకూడదు. ఆ యంత్రము ఒక పిన్నుపైకూడా ఆధారపడి ఉంటుంది. మన స్థాయికి తగినట్లుగా మనం ఉంటే దేశమనే యంత్రము బాగుంటుంది. కనుక, ఎవరెవరి స్థాయికి వచ్చిన పనిని మనం సక్రమంగా, హృదయపూర్వకంగా ఆచరించటానికి మనం సిద్ధంగా ఉండాలి. అదే work is worship, duty is God. ఈ రెండింటిని మనం దృఢంచేసుకోవాలి. ఈవిధంగా ఉంటుండి ఈ మూడు దినములలోపల మీకు తెలీసినటువంటి, తెలుసుకున్నటువంటి ఒకదానికొకటి మార్పులు, కూర్పులు చేసుకొని తద్వారా మీరు నూతనమైనటువంటి ఉత్తేజముతో, ఉల్లాసముతో తిరిగి మీ కార్యక్రమంలో మీరు వెళ్ళి పాల్గొంటారని నేను ఆశిస్తున్నాను. మీలో ఉన్నటువంటి సమస్యలు, మీకుండిన ఇక్కట్లు ఒకరికొకరు సంప్రదించుకొని సలహాలద్వారా దానిని సరిచేసుకోటానికి ప్రయత్నించాలి. మధ్యమధ్య మీలో ఉన్నటువంటి విలువైన సహాయముకూడను మీరు అందించాలి. ఎందుకంటే ఇది అంతా, మన సంస్థ పుష్పములతో చేరిన మాలగా వుంటున్నాది. అందులో ఒక్కొక్క పుష్పమునకు ఒకరకమైన సువాసన ఉంటుంది. కనుక, ఎవరెవరికి తోచిన సలహాలను అందించి తద్వారా నూతనమైన మాలగా, అందమైన గార్లెండ్‌గా, సుగంధమైన దండగా మనం తయారుచేయాలి. ఈ మూడు దినములు మనం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అనుభవజ్ఞులైనవారు, బాధ్యత కలిగినవారు చాలామంది కొన్ని ఆదర్శాలను అందిస్తారు. వారి ఉపన్యాసములు మీరు చక్కగా హృదయానికి హత్తుకొనేటట్లుగా అనుభవించి తద్వారా మీరు ఆచరణలో పెట్టటానికి ప్రయత్నించాలి.